క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, విద్యుత్ నగర్, సహకార నగర్, పోస్టల్ కాలనీ, డీఈఓ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మడికొండ, అయోధ్యపురం ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

గానకోకిల పురస్కారానికి భవాని ఎంపిక



హసన్‌పర్తి: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిట్టల భవాని గానకోకిల పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 12న కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో భవానికి గానకోకిల పురస్కారం అందజేస్తున్నట్లు ప్రకటించారు. భవానీని పలువురు అభినందించారు.

'శ్వేతార్క'లో 'కుడా' చైర్మన్ పూజలు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంను మంగళవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆలయానికి ఇనుగాల రావడంతో వేదపండితులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ఉన్న 29 దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన హోలు సాయికృష్ణ శర్మ స్వామివారి శేషవస్త్రాలతో పాటు చిత్రపటాన్ని అందించి ఇనుగాల దంపతులను సన్మానించారు.

ఎమ్మెల్సీని కలిసిన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు



న్యూశాయంపేట : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం వరంగల్ మండిబజార్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. తమ సంస్థ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అధ్యక్షుడు ఎం.ఏ.కలీం, ప్రధాన కార్యదర్శి సిరాజ్ అహ్మద్, డాక్టర్ రాజ్ మహ్మద్ తదితరులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

కాజీపేట: కాజీపేట పట్టణంలో లయన్స్ క్లబ్ సభ్యులు పేద విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు కాలనీల్లో ఉన్న పేద పిల్లలకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ చార్టెడ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

1 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో పీజీ సెమిస్టర్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈనెల 10 నుంచి నిర్వహించాల్సిన స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణకు ఆసక్తిగల విద్యార్థులు, బయటివారు, ఈనెల 31వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులకు రూ.1000, బయటివారికి రూ.1500లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

రామన్నపేట : ఈ నెల 7న ఆదివారం మద్యం మత్తులో మండిబజార్‌లో అర్ధరాత్రి వీరంగం సృష్టించిన తంగిలపల్లి రాజు, రేణిగుంట్ల ప్రవీన్, ఎర్ర రాకేశ్, అరుణ్, విజయ్‌లపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఆటో నడుపుకుంటున్న సలేమాన్ మండిబజార్‌కు చేరుకున్న సమయంలో అతనిపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఎండి. సలేమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ నిర్వాసితులను ఆదుకుంటాం

- గాడిపల్లిలో 12 మందికి పరిహారం చెల్లిస్తాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఖిలా వరంగల్ : మామునూరు ఎయిర్‌ఫోర్ట్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న నిర్వాసితులైన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఖిలావరంగల్ మండలంలోని గాడిపెల్లి, గుంటూరుపల్లి గ్రామాల పరిధిలోని ఎయిర్‌ఫోర్ట్ రన్‌వే పొడిగింపులో భూములు కోల్పోతున్న రైతులతో పాటు రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలిదశలో విమానాల రాకపోకలకు వీలుగా భూమిని సేకరించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. గాడిపల్లిలో సుమారు 12 మంది ఇళ్లు కోల్పోతుండడంతో వాటిని సందర్శించి ఇంటి యజమానులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం భూములు కోల్పోతున్న అన్నదాతలకు వరంగల్ పట్టణానికి చేరువలోనే భూములు ఇవ్వాలని, అదేవిధంగా గుంటూరుపల్లికి అతి సమీపంలోనే రహదారి ఏర్పాటు చేసే విధంగా చూడాలని రైతులు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి



ఫార్మసీ కళాశాలలో ట్రోఫీని విద్యార్థులకు అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివితే లక్ష్యసాధనలో భవిష్యత్‌లో ఉన్నతస్థితికి చేరుకునేలా విజయం సాధించగలుగుతారన్నారు. ఫార్మసీ విద్యార్థులకు పరిశోధన రంగంలో విస్తృత అవకాశాలున్నాయన్నారు. ప్రధానంగా డాడ్ ఫెల్లోషిప్, నాన్‌హోంబోల్ట్ ఫెల్లోషిప్ లాంటివి సాధించాలన్నారు. మంచి ప్రొఫెషనల్స్‌గా ఎదగాలని సూచించారు. ఫార్మసీ కళా శాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ కోర్సుల్లో విద్యార్థులు డొమెన్ విజ్ఞానంతో పాటు నవీన జీవనవిధానాలు, నైపుణ్యాలు పని పద్ధతులపై పట్టు సాధించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన గాల్లోస్-2024 ట్రోఫీని విద్యార్థులకు రిజిస్ట్రార్ అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, జె.కృష్ణవేణి, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ బి.నాగరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

బీసీ సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కరాటే ప్రభాకర్



ఖిలా వరంగల్: తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌కు చెందిన కొయ్యడ (కరాటే) ప్రభాకర్ నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కులాల సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరి భాస్కర్‌రావు, కొండ దేవయ్య పటేల్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరాటే ప్రభాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. బీసీ కులాల ఐక్యత, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కమిటీ ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మడికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మడికొండకు చెందిన కాసర్ల సతీష్‌రెడ్డి అన్నారు. కాజీపేట మండలం మడికొండలోని జిల్లా ఉన్న పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, నెట్‌ను ఆయన బహూకరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులు శారీరకంగా దృఢత్వంగా తయారవుతారని అన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం.సంధ్యారాణి, పీఈటీ రెబిక, మడికొండ హెడ్‌కానిస్టేబల్ జయరాజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు సన్మానం



ఆర్టీసీ ఆర్‌ఎం విజయభానును సన్మానిస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

హన్మకొండ: టీజీ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభానును స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సన్మానించారు. మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హనుమంత్, జనరల్ సెక్రటరీ రాజారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, ఎస్‌డబ్ల్యూయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఈఎస్ బాబు, సీనియర్ కార్మిక నాయకుడు ఎస్.ఆర్. కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దళారులు చెప్తేనే.. ధ్రువీకరణ పత్రం

- తహసీల్దార్ కార్యాలయాల్లో దళారుల తిష్ట
- అధికారులకు నెలవారీగా మామూళ్లు?

వరంగల్ : ప్రభుత్వం అందించే లబ్ధి పొందాలంటే తహసీల్దార్లు ధ్రువీకరించిన పత్రాన్ని ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే దళారులను ఆశ్రయిస్తే తప్పా చేతికి వచ్చే అవకాశం లేదని తెలిసింది. కాగా నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రం జారీకోసం మీ సేవ కేంద్రంలో లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ సేవ నిర్వాహకులు తహసీల్దార్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపిస్తారు. అక్కడ తహసీల్దార్ దరఖాస్తును పరిశీలించి సంబంధిత వీఆర్వో, ఆర్ఐలకు కేటాయిస్తారు. ఇలా కేటాయించిన దరఖాస్తులను ఆర్ఐలు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తహసీల్దార్‌కు నివేదక సమర్పిస్తారు. ఆర్ఐ నివేదకను పరిశీలించిన తహసీల్దార్లు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేస్తారు. ఈ విషయం సంబంధిత దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ (ప్రస్తుతం రావడం లేదని తెలిసింది) పంపిస్తారు. సమాచారం అందిన వెంటనే లబ్ధిదారుడు తాను దరఖాస్తు చేసుకున్న మీసేవ నుంచి ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలను అందుకుంటారు.

ఫ్యామిలీ సరిఫికెట్ మినహా..

తహసీల్దార్ కార్యాలయాల్లో ఒక్క ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మినహా మిగిలిన ధ్రువీకరణ పత్రాలు తూతూ మంత్రంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీలో కోర్టు మొట్టికాయలు వేయడంతో కొందరు తహసీల్దార్లు వెంటనే జారీకి వెనకాడుతున్నారు. ఈ క్రమంలో ప్రతి తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కొంత మంది దళారులు తిష్ట వేసుకున్నారు. వారు చెబితేనే సర్టిఫికెట్లు వస్తాయన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

తహసీల్‌లోనే దళారుల తిష్ట..

వరంగల్ తహసీల్ద్రార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగులతో పాటు స్థానికులు ఏళ్ల తరపడి పైరవీలు చేస్తున్నారు. అయితే ఉద్యోగులు ఆఫీసుకు రాగానే ముందు రోజు డీల్ చేసిన దరఖాస్తుల వివరాలను వారికి ఇవ్వగానే వెంటనే ధ్రువీకరణ పత్రాలు జారీఅవుతాయి. ఇక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మంజూరు చేసేందుకు విచారణ సమయంలో రూ.5నుంచి రూ.10వేలు ఇస్తే తప్పా ఫైల్ ముందుకు కదలదు. ఇలా తహసీల్‌లో పాతుకుపోవడంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వ ఉద్యోగుల ఫోర్జరీ సంతకాలు చేయడం రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. గతంలోనూ ఇలాంటి ధ్రువీకరణ పత్రాలు ఎన్నో జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఫోర్జరీ కేసు నమోదు

రామన్నపేట : ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందేందుకు తప్పుడు సంతకాలు చేసి పత్రాలు సృష్టించిన కొత్తవాడకు చెందిన ఆకారపు మహేందర్‌రెడ్డిపై తహసీల్దార్ ఇక్బాల్ ఫిర్యాదు మేరకు ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ గోపి తెలిపారు.

రాత్రిళ్లు రోడ్లపై తిరిగే యువతకు కౌన్సిలింగ్


వరంగల్ హెడ్ పోస్టాఫీసుతో పాటు మండిబజార్ ప్రాంతాల్లో రాత్రివేళలో సంచరించే యువకులకు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో హెడ్ పోస్టాఫీసు వద్ద వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తులదే హవా

- ప్రజలు ఆఫీస్ చుట్టూ తిరిగినా కదలని ఫైల్

కాశోజీ సెంటర్ : వరంగల్ ఆర్డీఓ ఆఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తుల హవా కొనసాగుతోంది. కార్యాలయంలో పైరవీకారులు చెబితే వెంటనే ఫైల్ కదులుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్డీఓ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో కొంతమంది మధ్యవర్తులు రికార్డులను తారుమారు చేస్తున్నట్లు వినికిడి. వీటిని చక్కది ద్దేందుకు ప్రైవేట్ వ్యక్తులు సంబంధిత సెక్షన్ అధికారులతో బేరం కుదుర్చుకుని ఫైల్‌ను క్లియర్ చేయిస్తున్నట్లు సమాచారం. ఏదైనా సమస్యపై కార్యాలయానికి వస్తే అంటీముట్ట నట్లు వ్యవహరిస్తున్నారని పనిమీద ఆఫీస్‌కు వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన సిదాం దత్తు అసిఫాబాద్‌లో పనిచేసిన కాలంలో భూ సేకరణ విషయంలో అక్రమాలకు పాల్పడ్డాడని ఏసీ బీ అధికారులు గత నెల 29న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దత్తు స్థా నంలో నర్సంపేట ఆర్డీఓ క్రిష్ణవేణికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాలన సక్రమంగా జరగడం లేదని పలువురి ఆరోపణ. కలెక్టర్ దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



హనుమకొండ : కేక్ కట్ చేస్తున్న రాజిరెడ్డి

హన్మకొండ/హన్మకొండ అర్బన్ : రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం హనుమకొండ సర్క్యూట్‌హౌజ్ రోడ్‌లోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో, బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సీతక్క ఉద్యమ సహచరులు కంకణాల విజయ సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలతో కలిసి కేక్ చేసి అన్నదానం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పుల్యాల రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి,రవీందర్,రమేశ్, సుచరితరెడ్డి, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఊటుకూరు సాయిరాం, కుమారస్వామి, ఐనవోలు దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ అధికారులు అందుబాటులో ఉండాలి

- వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా



మామునూరు పోలీస్‌స్టేషన్ పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మామునూరు : పోలీస్ స్టేషన్ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని, ఫిర్యాదుదారుల పట్ల జవాబుదారులుగా విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్‌కిషోర్ ఝా సూచించారు. మంగళవారం రాత్రి మామునూరు పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ తిరుపతితో కలిసి సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. అంతకు ముందు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది విధులు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అంకితభావంతో పనిచేయాలని, సేవా మార్గంతో పేద ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల జావాబుదారితనంగా పనిచేసి పోలీస్‌ప్రతిష్ఠతను పెంచాలని పేర్కొన్నారు. సీపీ వెంట ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, ఉన్నారు

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు



జనపనార సంచులను ప్రదర్శిస్తున్న సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సభ్యులు

హసన్‌పర్తి: ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరాధన క్లాత్ స్టోర్స్ సహకారంతో జనపనార సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గోపాలపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని సూచించారు. కాలుష్య నివారణతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానివేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగులగాం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు ఉపేంద్రచారి, సాంబయ్య, రాజేందర్, మలహాల్‌రావు, రాజమొగిలి, యాదగిరి, సత్యనారాయణ, ఓరుగల్లు రక్షణ సమితి అధ్యక్షుడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడేది ఏబీవీపీ



యూనివర్సిటీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు

విద్యారణ్యపురి: కళాశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాల స్థాయి వరకు విద్యారంగ సమస్యలపై పోరాడేది అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అని విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు కూడా కృషి చేస్తుందని ఏబీవీపీ జాతీయ సమితి సభ్యుడు మాచర్ల రాంబాబు అన్నారు. ఏబీవీపీ జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా మంగళవారం కేయూ సమీపంలోని భీమారం నుంచి యూనివర్సిటీ రోడ్డులో నయీంనగర్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఏబీవీపీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఏబీవీపీ విభాగ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, బాధ్యులు మనోజ్, హరిచరణ్, భరత్, యశ్వంత్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


విధుల కేటాయింపుపై ఆరోపణలు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల డ్యూటీల కేటాయింపులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. గార్డుల డ్యూటీలను ప్రతి 15 రోజులకోసారి మార్పులు చేస్తారు. ఉద్యోగుల వాచ్ అండ్ వార్డ్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న వారు తమకు అత్యంత సన్నిహితంగా ఉన్న గార్డులకు ఆదాయం ఉన్న ప్రదేశాల్లో డ్యూటీలు వేస్తున్నారన్న ఆరోపణలపై గార్డులు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలిసింది. డ్యూటీలు మార్చిన వారు 15 రోజులు విధులు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ 10 రోజుల తర్వాత మళ్లీ గతంలో నిర్వహించిన యార్డుల్లోనే పనిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మంగళవారం కొంత మంది సెక్యూరిటీ గార్డులు వాచ్ అండ్ వార్డు సూపర్‌వైజర్‌ను నిలదీసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం డ్యూటీలను వేయాలని సెక్యూరిటీ గార్డులు మార్కెట్ అధికారులను కోరుతున్నారు.

కోటలో వనభోజనాలకు ఏర్పాట్లు

ఖిలా వరంగల్: ఆషాఢమాసం సందర్భంగా పడమరకోటలోని కనకదుర్గమ్మ గుడి ఆవరణలో శరవేగంగా వనభోజనాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బీఆర్ఎస్ నేత బోగి సురేష్, బల్దియా అధికారుల ఆధ్వర్యంలో జేసీబీతో ముళ్లకంప, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

కొండా దంపతుల చిత్రపటాలకు పాలాభిషేకం



వరంగల్ చౌరస్తా : వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులో వన్ వే ఎత్తివేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు దంపతుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. వరంగల్ చౌరస్తాలో బులియన్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రజల కోసం హనుమకొండ శ్రీ రామకృష్ణ సేవాసమితి వేదికగా బుధవారం నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు యోగా గురువు ఆర్.రవీంద్రాచారి తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణా శిబిరం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 98484 50493 లో సంప్రదించాలని తెలిపారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

హన్మకొండ చౌరస్తా: తమిళనాడులో మాదిరిగా తెలంగాణలో సైతం ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులను అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో మంగళవారం హనుమకొండ రాజు అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు, డొనేషన్, టర్మ్ ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని అన్నారు.

మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

హన్మకొండ: గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని వరంగల్‌లో ఏర్పాటు చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మంగళవారం హనుమకొండలో తిరునహరి శేషు లేఖ విడుదల చేసి వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 21న నుంచి ప్రారంభమయ్యే గ్రూప్–1 పరీక్షకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు సమీప జిల్లాల నుంచి ఎంతో మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అయితే రా ష్ట్రవ్యాప్తంగా ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో దూరప్రాంత అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా మహిళలు చాలా ఇబ్బంది ప డుతారన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల అభ్యర్థుల సౌకర్యార్థం వరంగల్‌లో సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. సివిల్స్ పరీక్ష లాంటి అత్యుత్తమ పరీక్షలతో పాటు అన్ని రకాల పరీక్షలను వరంగల్‌కు సెంటర్‌గా కేటాయిస్తున్నారన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు



వరంగల్ క్రైం: యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా, యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలనే ఆలోచనతో ఆచార్య రవి రూపొందించిన వాల్ పోస్టర్లను కమిషనరేట్ కార్యాలయంలో సీపీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.

కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలి

కాజీపేట: ఏడు నెలల కాలంలో విధి నిర్వహణలో ఉండి రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన 10 మంది పారిశుద్ధ్య ఔట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు పాలకవర్గం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంటికో ఉద్యోగం వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్మిక కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మాలోతు రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలను పర్యవేక్షించేందుకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

హసన్‌పర్తి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పర్లపల్లి రాజ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

భేరుండా నిత్యగా రాజరాజేశ్వరి అమ్మవారు



హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరిదేవీ దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాజరాజేశ్వరి అమ్మవారిని భేరుండా నిత్యగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ అర్చకులు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి గణపతి సుబ్రమణ్యం సూర్య నర్సింహా శివబాల లలిత రాజా శ్యామల ఆవరణార్చనలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మహాహారతి, భోజనప్రసాదాల వితరణ చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.